క్లుప్తంగా

ఎంపీ వేమిరెడ్డిని కలిసిన గునపాటి



ఇందుకూరుపేట: ఇందుకూరుపేటకు చెందిన డీసీఎమ్మెస్ డైరెక్టర్ గునపాటి సురేష్‌రెడ్డి శుక్రవారం రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని ఎంపీ నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు భీమవరపు వెంకటకృష్ణారెడ్డి, భానుచంద్రశేఖర్, చక్రి, వాసు పాల్గొన్నారు.

కొండ చిలువ హల్‌చల్



మృతిచెందిన కొండచిలువ

మనుబోలు: ఓ కొండ చిలువ గ్రామంలో హల్‌చల్ చేస్తూ దూడలను తినేందుకు ప్రయతి్నంచగా గ్రామస్తులు కొట్టి చంపేశారు. ఈ ఘటన మండలంలోని చెరుకుమూడి గ్రామంలో శుక్రవారం ఉదయం జరిగింది. సుమారు 9 అడుగుల పొడవున్న కొండ చిలువ గ్రామంలోని నాగూర్‌బాషా ఇంటి ఆవరణలోకి ప్రవేశించింది. సమీపంలోని దూడలు, కోళ్లను తినేందుకు ప్రయతి్నంచగా కొట్టి చంపేశారు.

అభినందన



వెంకటాచలం: వెంకటాచలానికి చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మందల వెంకటశేషయ్య వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన నేపథ్యంలో శుక్రవారం ఆయన నివాసంలో పలువురు పార్టీ నాయకులు, అభిమానులు కలిసి శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

గిరిజనులకు అన్యాయం చేసిన చంద్రబాబు



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(మినీబైపాస్): గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని గిరిజనులకు చంద్రబాబు అన్యాయం చేశారని ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు ప్రభాకర్ ఆరోపించారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు ఇట్టా వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వృద్ధురాలి మృతి

నెల్లూరు(క్రైమ్): దీపారాధన చేస్తూ ప్రమాదవశాత్తూ గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు శుక్రవారం మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. ఏసీనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో సుబ్రహ్మణ్యకుమార్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన అత్త కామాక్షమ్మ (65) ఈ నెల 13వ తేదీ ఉదయం ఇంట్లో దీపారాధన చేస్తుండగా ప్రమాదవశాత్తూ నైటీకి నిప్పంటుకొని శరీరం కాలింది. గమనించిన కుటుంబసభ్యులు మంటలను ఆర్పి చికిత్స నిమిత్తం తొలుత నారాయణ హాస్పిటల్‌కు.. మెరుగైన చికిత్స నిమిత్తం చెన్నైలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు ఈ నెల 19న తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. మృతురాలి అల్లుడి ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పవిత్రోత్సవాలకు అంకురార్పణ



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో నిర్వహించనున్న పవిత్రోత్సవాలకు అంకురార్పణను భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. విశేష పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు, నిశింద సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, ధర్మకర్తల మండలి సభ్యులు నరసింహాచార్యులు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మీదేవీ నమోస్తుతే

- అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- వైభవంగా వరలక్ష్మీవ్రతాలు
- సామూహిక కుంకుమార్చనలు

బుచ్చిరెడ్డిపాళెం: శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా మండలంలోని జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీవ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలోని వేదికపై అమ్మవారిని కొలువుదీర్చి ప్రత్యేకంగా అలంకరించారు. తదుపరి శాస్త్రోక్తంగా నిర్వహించిన వరలక్ష్మీవ్రతంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సామూహిక వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న మహిళలకు ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు – లక్ష్మీకాంతమ్మ దంపతులు ఉచితంగా పూజాసామగ్రిని అందజేశారు. వరలక్ష్మీవ్రతం సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ఆవరణ కిక్కిరిసిపోయింది. కార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు, పాలకమండలి సభ్యులు నందకుమార్, సుప్రజ, రఘురామయ్య, విమల తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు: శ్రావణమాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని పొదలకూరు మండలంలోని పలు ఆలయాల్లో వరలక్ష్మీవ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మరుపూరు గ్రామంలో ఉన్న శ్రీకామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో వైభవంగా నిర్వహించిన వరలక్ష్మీ వ్రతం, సామూహిక కుంకుమార్చనలో మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు యశ్వంత్‌రెడ్డి దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారు. పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో వరలక్ష్మీవ్రతాన్ని, సామూహిక కుంకుమపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు. అలాగే పొదలకూరు పట్టణానికి సమీపంలోని సంగం మార్గంలో తోడేరు శ్రీపార్వతీదేవి దేవస్థానంలో వరలక్ష్మీవ్రతం ఘనంగా జరిగింది. గూడూరు గోపాల్‌రావు–సుభోధిని, గూడూరు రామయ్య–దొరసానమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. పట్టణంలోని శ్రీకన్యకా పరమేశ్వరీదేవి ఆలయం, అయ్యప్పనగర్ శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. గోపూజ, సమస్రనామ కుంకుమార్చన జరిపారు.



బుచ్చిరెడ్డిపాళెం: ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



బుచ్చిరెడ్డిపాళెం: సామూహిక వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న మహిళలు

భక్తిశ్రద్ధలతో..

ముత్తుకూరు: శ్రీవరలక్ష్మీవ్రతం పర్వదినాన్ని శుక్రవారం మండలంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రావణమాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకొని మహిళలు లక్ష్మీదేవిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కృష్ణపట్నం, ముత్తుకూరు, ఈపూరు తదితర గ్రామాల్లోని శ్రీచెన్నకేశవస్వామి ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకొన్నారు.

శ్రావణమాస పూజలు

మనుబోలు: శ్రావణమాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని మనుబోలులోని పలు ఆలయాల్లో శ్రావణమాస పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు వరలక్ష్మీవ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. విష్ణాలయం, మనుబోలమ్మ, గంగమ్మ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు హనుమాచార్యులు స్థానిక విష్ణాలయంలో సామూహిక కుంకుమపూజ జరిపించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గంగపట్నంలో..

ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నంలో వెలసిన శ్రీచాముండేశ్వరదేవి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీవ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అనిల్‌స్వామి, రామకృష్ణస్వామి, కిషోర్‌స్వామి అమ్మవారికి పూలంగిసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాముడుపాళేనికి చెందిన శ్రీనివాసులు – కామాక్షమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

కొడవలూరు మండలంలో..

నార్తురాజుపాళెంలో ఉన్న శ్రీమహాలక్ష్మీ ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీవ్రతం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించారు.



మనుబోలు: విష్ణాలయంలో సామూహిక పూజలు చేస్తున్న మహిళలు



బుచ్చిరెడ్డిపాళెం: అమ్మవారి వద్ద పూజలు చేస్తున్న అర్చకులు



పొదలకూరు: శ్రీకామాక్షి సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో సామూహిక కుంకుమపూజలో పాల్గొన్న మహిళలు

ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం



ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి చిత్రపటం అందజేస్తున్న అచ్యుత్‌రెడ్డి

కోవూరు: తనపైన నమ్మకముంచి వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో స్థానం కల్పించిన కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి రుణపడి ఉంటానని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన పూండ్ల అచ్యుత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నెల్లూరులోని ఎమ్మెల్యే నివాసంలో విడవలూరు నాయకులతో కలిసి ఆయనకు శ్రీవెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విడవలూరు మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు ఎస్.రంజిత్‌కుమార్‌రెడ్డి, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

పేదలకు ఉపాధి, స్థిరాస్తి అవసరం



మైపాడులో ప్రజలతో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

ఇందుకూరుపేట: పేదలకు ఉపాధి, స్థిరాస్తి అవసరమని, అప్పుడే అభివృద్ధి సాధ్యమని మాజీ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని మైపాడు, నరసాపురం, మొత్తలు, జగదేవిపేట గ్రామాల్లో శుక్రవారం ఐక్యత ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు అన్ని ప్రాంతాల్లో, అన్ని వర్గాల్లో ఉన్నారని, వారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తాత్కాలిక ఉపశమన పథకాలతో వారి అభివృద్ధి సాధ్యం కాదన్నారు. పేదల నుంచి నాయకులను తయారు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

రాష్ట్రంలో సుపరిపాలన



శ్మశాన వాటికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: రాష్ట్రంలో నాలుగేళ్లుగా సుపరిపాలన సాగుతుందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని 18వ వార్డు మంగళికట్ట ప్రాంతంలో శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో రాక్షస పాలన సాగిందని, అందుకే రాష్ట్ర ప్రజలు వైఎస్సార్‌సీపీని 151 స్థానాల్లో గెలిపించి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టాభిషేకం చేశారని తెలిపారు. మరోసారి కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా కోవూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 82 సచివాలయాల పరిధిలో 97,431 ఇళ్లను సందర్శించి ప్రజలతో మమేకమయ్యామని తెలిపారు.

రుణాల మంజూరు

స్థానిక 18వ వార్డులో నివాసం ఉంటూ జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న ఇద్దరు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.35 వేల చొప్పున బ్యాంక్ రుణం మంజూరు కావడంతో ఆ నగదును అందజేశారు. ఇంటి నిర్మాణాన్ని మరింత నాణ్యతగా నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.

శ్మశానవాటిక ప్రారంభం

మంగళికట్టలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన శ్మశాన వాటికను ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలను అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చీర్ల ప్రసాద్, కందుకూరు యానాదిరెడ్డి, మల్లారెడ్డి, షకీలాబేగం, అనంతమ్మ, శివకుమార్‌రెడ్డి, రహమత్, నస్రీన్, సత్యనారాయణ, ప్రమీలమ్మ, నాయకులు ఇప్పగుంట విజయబాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అల్లాభక్షు, విల్సన్, ప్రవల్లిక, శ్రీకాంత్‌రెడ్డి, చాందిని, పెంచలయ్య, శ్రావణ్ పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



మంత్రి కాకాణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెంకటశేషయ్య

వెంకటాచలం: వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన మందల వెంకటశేషయ్య రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. తనను జిల్లా ఉపాధ్యక్ష పదవికి ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల నాయకులు మంత్రి కాకాణిని, వెంకటశేషయ్యను ఘనంగా సత్కరించారు.

కోవూరుకు సముచితస్థానం



విజయభాస్కర్‌రెడ్డి



పి.అచ్యుత్‌రెడ్డి



టి.పార్వతమ్మ



షేక్.షబ్బీర్



సీహెచ్.శ్రీదేవి

కోవూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో కోవూరు నియోజకవర్గానికి సముచితస్థానం కల్పించారని పార్టీ నాయకులు పేర్కొన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా విడవలూరుకు చెందిన కోవూరు మాజీ ఏఎంసీ చైర్మన్ పూండ్ల అచ్యుత్‌కుమార్‌రెడ్డిని, జిల్లా కార్యదర్శిగా బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన ఇప్పగుంట విజయభాస్కర్‌రెడ్డిని, కార్యవర్గ సభ్యులుగా కోవూరు ఎంపీపీ తుమ్మలపెంట పార్వతమ్మ, బుచ్చిరెడ్డిపాళెం కౌన్సిలర్ చలంచర్ల శ్రీదేవి, ఇందుకూరుపేట మండలం కొత్తూరుకు చెందిన షేక్ షబ్బీర్‌లను ఎంపిక చేసిన నేపథ్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు వారికి శుక్రవారం అభినందనలు తెలిపారు.

నేడు రైతులకు సూక్ష్మసేద్యం పరికరాల పంపిణీ

పొదలకూరు: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పొదలకూరు ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ప్రాంగణంలో శనివారం ఉదయం 10 గంటలకు రైతులకు సూక్ష్మసేద్యం పరికరాలు పంపిణీ చేస్తారని ఏపీఎంఐ పీడీ బి.శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. మండలంలోని రైతులు సూక్ష్మసేద్యం కోసం చెల్లించిన రాయితీ నగదు ప్రకారం వారి తోటల్లో డ్రిప్ పైపులు, స్ప్రింక్లర్ల పంపిణీ అనుమతి పత్రాలను మంత్రి అందజేస్తారని తెలిపారు. లబ్ధిదారులు కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు.

అన్ని దానాల్లో రక్తదానం మిన్న

ముత్తుకూరు : అన్ని దానాల్లో రక్తదానం గొప్పదని కృష్ణపట్నం సీఐ వెంకటరెడ్డి పేర్కొన్నారు. ముత్తుకూరులోని మత్స్యకళాశాలలో శుక్రవారం మార్‌టెక్ సంస్థ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. హెల్పింగ్ హ్యాండ్స్ సహకారంతో సీఎస్సార్ కింద ఈ శిబిరాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని మార్‌టెక్ జీఎం శ్రీనివాసపవన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన 103 మందిని అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సైలు అంజిరెడ్డి, శివకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత లక్ష్మణరెడ్డి, అసోసియేట్ డీన్ బాలసుబ్రమణియన్, నోవా బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి భాస్కర్‌నాయుడు, హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు విజయభాస్కర్, పంచాయతీ ఈఓ చక్రం వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ త్రివేణి పాల్గొన్నారు.



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఎన్ఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా చేయూత

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలోని వివిధ వార్డులకు చెందిన పలు బాధిత కుటుంబాలకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా శుక్రవారం మంగళికట్ట వద్ద ఆర్థిక సాయాన్ని అందజేశారు. పెద్దూరుకు చెందిన విద్యార్థి కె.అనిల్‌కు రూ.20 వేలు, ఐరన్ బండిని ఏర్పాటు చేసుకునేందుకు గంజం పుల్లమ్మ అనే మహిళకు రూ.10 వేలు, పక్షవాతంతో బాధపడుతున్న సురేష్‌కు రూ.15 వేలు, ఆర్థిక ఇబ్బందులు పడుతున్న బుజ్జమ్మ అనే మహిళకు రూ.20 వేల చొప్పున ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

హంస పురస్కారానికి మాడభూషి సంపత్‌కుమార్ ఎంపిక



మాడభూషి సంపత్‌కుమార్

వెంకటాచలం: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న హంస పురస్కారానికి మండలంలోని సరస్వతీనగర్ వద్ద నున్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ ఎంపికయ్యారు. తెలుగుభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తెలుగు, సంస్కృత అకాడమి తరఫున తెలుగు భాషాభివృద్ధికి పాటుపడే వారిని ప్రతి ఏటా పలు విభాగాల్లో హంస పురస్కారాలకు ఎంపిక చేసి అవార్డులు అందించి సత్కరిస్తుంది. 'కవిత్వం'లో మాడభూషి సంపత్‌కుమార్‌ను ఎంపిక చేశారు. ఈ నెల 29వ తేదీన రాజమండ్రిలో జరగనున్న తెలుగుభాషా దినోత్సవంలో ఆయన ఈ అవార్డును అందుకోనున్నారు.

పెండింగ్‌లో ఉన్న సేవలను పూర్తి చేయండి

నెల్లూరు(బారకాసు): సచివాలయాల్లో పెండింగ్‌లో ఉన్న సేవలను గడువులోపు పూర్తి చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. మెడికవర్ ఆస్పత్రి వెనుక వైపున కాలువ సమస్యతో పాటు ధనలక్ష్మీపురం, వావిలేటిపాడు ప్రాంతాలకు సంబంధించి 'జగనన్నకు చెబుదాం', స్పందనలో అందిన ఫిర్యాదులను అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం 17 / 3 ఆకుతోట దళితవాడలోని వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. స్థానిక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందిస్తున్న ఉచిత వైద్యం, మందుల పంపిణీ, రక్త పరీక్షలు, తదితర సేవలపై సచివాలయ పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

నిర్మాణ పనులు వేగవంతం

జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు అదనపు కార్మికులను నియమించి.. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. వెంకటేశ్వరపురంలోని లేఅవుట్‌ను హౌసింగ్ విభాగం, ఎస్పీడీసీఎల్, నగరపాలక సంస్థ అధికారులతో కలిసి పరిశీలించారు.

టిడ్కో గృహాలపై సమీక్ష

టిడ్కో ఫ్లాట్లపై సమీక్ష సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో కమిషనర్ నిర్వహించారు. టిడ్కో గృహ లబ్ధిదారులకు రుణాల మంజూరును సులభతరం చేయాలని సూచించారు.

28న న్యాయవాదుల కోర్టు విధుల బహిష్కరణ

నెల్లూరు(లీగల్): విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది ప్రవీణ్‌కుమార్‌పై దాడి ఘటనకు నిరసనగా కోర్టు విధులను న్యాయవాదులు సోమవారం బహిష్కరించనున్నారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్య తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో అత్యవసర కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సహకరించాలని కోరారు.